
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 28 జూలై 2024
5





Sunday SPECIAL

టీచర్లూ.. సెల్యూట్

- తాము పనిచేసే సర్కారు బడిలోనే తమ పిల్లలకు చదువులు
- ప్రైవేటు స్కూళ్లు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దంటున్న పలువురు గురువులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు
- గవర్నమెంట్ బడుల్లోనే మెరుగైన బోధన, సౌకర్యాలున్నాయంటూ కితాబు

7




ఇప్పుడంతా 'కార్పొరేట్' యుగం. చదువుల నుంచి కొలువుల వరకూ అందరూ కార్పొరేట్ సంస్థలవైపే మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థపై తల్లిదండ్రులు కూడా అంతగా ఆసక్తి చూపడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు సైతం కష్టాలు పడైనా.. అప్పులు చేసైనా.. తమ పిల్లలను ప్రముఖ నగరాలు, పట్టణాల్లోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిస్తుంటే.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం.. తమ పిల్లలకు తాము పనిచేసే ప్రభుత్వ బడుల్లోనే చదువు చెప్పిస్తున్నారు. పెద్దపెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువు చెప్పించే స్తోమత ఉన్నా.. సర్కారు స్కూళ్లలోనూ మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, నాణ్యమైన విద్యాబోధన అందుతోందని, ప్రైవేట్, కార్పొరేట్ తరహాలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, ఇంగ్లీష్ మీడియం బోధన కూడా మెరుగ్గానే ఉంటోందని కితాబిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో కొలువులు చేసి.. ప్రజాధనాన్ని వేతనంగా తీసుకోవడమే కాదు.. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించేలా తమ పిల్లలకు సర్కారు చదువు చెప్పిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్


కేసముద్రం మండలం కల్వల శివారులో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు (ఫైల్)

హలధారికి అండగా.. రైతు బీమా

- ఆరేళ్లలో 3900 కర్షక కుటుంబాలకు రూ.195 కోట్ల పరిహారం చెల్లింపు
- రైతు బీమా చేసుకునేందుకు తుది గడువు ఆగస్టు 5
- విస్తృత ప్రచారం కల్పిస్తున్న వ్యవసాయశాఖ



మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై27 : అన్నదాతల కుటుంబాలకు రైతుబీమా పథకం అండగా నిలుస్తోంది. ఆయా కుటుంబాల్లో పెద్దదిక్కును కోల్పోతే, వారి కుటుంబాలు వీధిన పడవద్దని ఆర్థికంగా, అండగా నిలిచేందుకు గత ప్రభుత్వ హయంలో రైతుబీమా పథకం ప్రవేశపెట్టారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ రైతు ప్రభుత్వం ఆపథకాన్ని తొలగించకుండా అలాగే ఉంచి ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు నడుస్తోంది. అన్నదాతలు ఒక్కపైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఇన్సూరెన్స్ (ప్రమాదబీమా) ప్రీమియం ఎల్ఐసీకి చెల్లిస్తుంది. ఏటా ప్రభుత్వమే రైతుబీమాను రెన్యూవల్ చేస్తుంది. ఈ పథకంలో చేరిన రైతు ప్రమాదవశాత్తు మృతి చెందినా, సహజంగా, మరేదైనా కారణం చేత మరణించినా బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు చెల్లిస్తుంది. ఇందుకోసం వ్యవసాయశాఖ మధ్యతత్వంతో రైతుబీమా పథకానికి ఇన్సూరెన్స్ వచ్చేలా సహాయపడుతుంది. మహబూబాబాద్ జిల్లాలో 2018-19 నుంచి 2023-24 కాలం వరకు 3900 క్లయిమ్‌లను సెటిల్ చేసి రూ.195 కోట్లను ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అందించింది.

పథకానికి అర్హులు ఎవరంటే..

పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన ప్రతీ కర్షకుడు ఈ రైతుబీమాకు అర్హుడు. రైతుకు 18 నుంచి 59 ఏళ్ల వరకు వయస్సు కలిగి ఉండాలి. ఆ వయస్సుకు ఆధార్ కార్డు ప్రమాణికంగా తీసుకుంటారు. రైతు స్వయంగా వ్యవసాయశాఖకార్యాలయానికి వెళ్లి నామినేషన్ ఫారం మీద సంతకం చేసి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ సమర్పించాలి. అయితే ఒక్కరైతు ఎన్నిచోట్ల భూమి ఉన్నా ఒక గ్రామంలో మాత్రమే రైతుబీమా వర్తిస్తుంది.

2018 నుంచి రైతుబీమా ఇలా..

2018-19లో గత ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ సమయంలో 100344 మంది రైతులు అర్హులుగా తేల్చారు. 456 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందితే.. 455 మంది రైతుల క్లయిమ్‌లు పరిష్కరించి రూ.22.75 కోట్లు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున బీమాను అందజేశారు. అలాగే 2023-24 సంవత్సరం వరకు ఈ పథకం కొనసాగుతూనే ఉంది.

కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి..

ఈ ఏడాది జూన్ 28వ తేదీ వరకు కొత్తగా పట్టాదారుపాస్‌పుస్తకం (రెవెన్యూ అధికారుల డిజిటల్ సంతకంతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకం) రైతులు ఆగస్టు 5 తేదీ వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని రైతులు కూడా అప్లయి చేసుకోవాలన్నారు. గతంలో రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు బీమాలో మార్పులు, చేర్పులు, నామిని చనిపోయి నట్లయితే మార్పులు చేయడానికి ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు.

సంవత్సరం	అర్హత రైతులు	మృతి చెందిన రైతులు	లబ్ధిపొందిన వారు	అందజేసిన నగదు
2018-19	100344	456	455	రూ. 22.75 కోట్లు
2019-20	113986	502	502	రూ. 25.10 కోట్లు
2020-21	116273	775	774	రూ. 38.70 కోట్లు
2021-22	130412	736	736	రూ. 36.80 కోట్లు
2022-23	137098	744	742	రూ. 37.10 కోట్లు
2023-24	144522	807	691	రూ. 34.55 కోట్లు
మొత్తం	742635	4020	3900	రూ. 195 కోట్లు


ఫాతిమా హైస్కూల్లో ఎన్జీసీ వర్క్‌షాపులో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలపై దృష్టి సారించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 27 : పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సూచించారు. మహబూబాబాద్ ఫాతిమా హైస్కూల్‌లో శనివారం నేషనల్ గ్రీన్‌కోర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎల్ఈడీ ట్యూబ్ లైట్ల తయారీ ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ అనుకూల జీవన విధానాన్ని అలవర్చుకొని, భవిష్యత్‌తరాలు ఇంధన, సహజ వనరుల కొరతలేకుండా జీవితం కొనసాగించేలా చూడాలన్నారు. మానవాళి మనుగడకు ఉపయోగపడే పరిశోధనలపై దృష్టి సారిస్తూ శాస్త్ర, సాంకేతికరంగాల్లో అభివృద్ధి సాధించాలని విద్యార్థులు సూచించారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేందుకు ఈ వర్క్‌షాపు దోహదపడుతుందన్నారు. ఈ వర్క్‌షాపులో జిల్లాకు చెందిన 46 ఎన్జీసీ ఏకోక్లబ్స్ నుంచి 138 మంది విద్యార్థులు, 46 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీసీ ప్రాజెక్టు అధికారి బి.విద్యాసాగర్, జిల్లా ఎన్జీసీ సమన్వయకర్త డాక్టర్ వి. గురునాథరావు, హెచ్ఎం మేరీ, ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, రిసోర్సు పర్సన్‌లు కిరణ్, సాయితేజ పాల్గొన్నారు.


కలెక్టర్ అద్వైత్‌కమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, కౌన్సిలర్లు

కుక్కలకు ఆవాస ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలి

- కలెక్టర్‌కు మునిసిపల్ పాలకమండలి విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, జూలై 27 : మానుకోట మునిసిపల్ పరిధిలో కుక్కలకు ఆవాస ప్రాంతాన్ని ఏర్పాటు చేసి, వేస్టేజ్ ఫుడ్‌ను అందించి వాటిని అక్కడికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు శనివారం మునిసిపల్ పాలకమండలి సభ్యులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ మాట్లాడుతూ మానుకోట మునిసిపల్ పరిధిలో ఇటీవల ప్రజలు, చిన్నారులపై కుక్కలు దాడులు చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ పరిధిలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను ఏర్పాటు చేసి, కుక్కల పెంపుదలను తగ్గించేందుకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయడం జరుగుతుందని చెప్పారు. ఆ తర్వాత వాటిని తీసుకువచ్చిన ప్రాంతాల్లో విడిచి పెట్టడం జరుగుతుందన్నారు. కుక్కలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ శివార్లలో ఒక ప్రాంతంలో అవాసం ఏర్పాటు చేసి పట్టణంలోని వేస్టేజ్‌ఫుడ్‌ను అందించి కుక్కలను అక్కడికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డుకౌన్సిలర్లు దండబోయిన బుజ్జివెంకన్న, భూక్య శ్రీను, డౌలాగర్ శంకర్, కోడి శ్రీను, అంబాల శివకుమార్, భూక్య రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ బీజేపీ ధర్నా

- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తొర్రూరు, జూలై 27 : రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ.. శనివారం తొర్రూరులో ప్రధా న రహదారిపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగరాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. అనంతరం సీఎంరేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మోదీ పదేళ్లలో ఎలాంటి వివక్షలేకుండా పది లక్షల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని, ప్రగతికి సహాయ సహకారాలు అందిస్తుంటే ప్రధాని చిత్రపటాన్ని దహనం చేయడం సిగ్గుచేటన్నారు. భారత్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ విశ్వగురువు స్థానంలో నిలిపిన మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఓర్వలేని దుర్మార్గం అని, కాంగ్రెస్ పార్టీ నేతలు విషప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రజలకు మోదీ పట్ల విశ్వాసం ఉందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఎన్ని ప్రయోగాలు చేసినా నమ్మరన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉన్నారా! లేరా? అని ప్రజలు చర్చించుకుంటున్నారని, రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నియోజకవర్గానికి నయాపైసా కూడా కేటాయించలేదన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, రంగు రాములు, సురేష్, రాజేష్, శేఖర్, రాంబాబు, రాజ్ కుమార్, నవీన్, రవి, రాజు, సంతోష్, శివ, భాస్కర్, సందీప్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో న్యాయ చైతన్య సదస్సులు


న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక

మహబూబాబాద్ రూరల్, జూలై 27 : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహబూ బాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికారిక సంస్థ కార్యదర్శి సురేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ పర్యవేక్షణలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం న్యాయచైతన్య సదస్సులు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్‌జైల్లో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో సురేష్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక ఆధ్వర్యంలో జైల్ ఆదాలత్‌ను నిర్వహించారు. ఇందులో మూడు కేసులను పరిష్కరించారు. అనంతరం మహబూబాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ సమీ పంలో ప్రభుత్వ ఫార్మసి కళాశాలలో మహిళ చట్టాల పై న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ విద్యార్థినులు మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోక్సో, బాలకార్మిక, బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణా లాంటి చట్టాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది దాసరి నాగేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ స్వప్నరెడ్డి పాల్గొన్నారు.

'గార్ల'వాసికి అరుదైన అవకాశం

- ఐరాస సమావేశానికి హాజరుకాన్ను జోగిరాంనాయక్

గార్ల, జూలై 27 : మండలంలోని చిన్నమంజర తండాకు చెందిన గిరిజన ముద్దుబిడ్డ, ఉన్నత విద్యావేత్త బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ జోగిరాంనాయక్‌కు ఐక్యరాజ్య సమితి సమావేశంలో పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. యూఎన్‌ఏ ఆఫ్రికాలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి జరిగే ఐక్యరాజ్య సమితి సమావేశాలకు ఆహ్వానం అందింది. గార్ల, డోర్నకల్, కామేపల్లి, కారేపల్లి, మండలాల్లో బంజార సేవా సమితి ద్వారా ఆయన

మిగతా 8వ పేజీలో..

పీఆర్టీయూతోనే టీచర్ల సమస్యలకు పరిష్కారం

- జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ

డోర్నకల్, జూలై 27 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ముందుంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. ముల్కలపల్లి, పెరుమాండ్ల సంకీసల్లో పర్యటించి శనివారం పీఆర్టీయూ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం ఫిట్‌మెట్‌తో పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 11, 12ను సవరించి బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 2013 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలన్నారు.

పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దుకింద వేతనాలు ఇవ్వాలని, పదోన్నతులు, బదిలీలు కల్పించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. పాఠశాలలన్నింటికి ఉచిత విద్యుత్ నందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంపటి సీతారాములు, ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, వినోద్, శ్రీధర్, ప్రభుదాస్, బాలాజీ, రమేష్, రామన్న, ప్రదీప్, పేరన్న, కమల, నరేందర్, అరుణాదేవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


డోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీసలో పీఆర్టీయూ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న బద్రినారాయణ

మేడారం పూజారి మృతికి మంత్రుల సంతాపం

మేడారం, జులై 27 : తాడ్వాయి మండలం మేడారం సారలమ్మ పూజారి కాక సంపత్ మృతికి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సంతాపం తెలిపారు. పూజారి కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉంటూ ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో జీపీ కార్యదర్శి ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



వెంకటేష్(ఫైల్)

తొర్రూరు, జూలై 27 : ఆర్థిక ఇబ్బందులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన ఘటన శనివారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై జగదీష్ తెలిపిన ప్రకారం. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన పేర్ల వెంకటేష్ (32) దంతాలపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. కార్యదర్శుల వేతనాలు పెంచాలని కోరు తూ గతంలో సమ్మె చేసిన నేపథ్యంలో వేతనాలు రాకపోవడం, ఒకసారి విధుల నుంచి సస్పెండ్ కావడంతో మనోవేదనకు గురయ్యా డు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉండడంతో సతమతమవుతున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి పట్టణ శివారులోని వ్యవసాయ బావిలో దూకి వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో శవా న్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య పేర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీచర్లూ.. సెల్యూట్

తాము పనిచేసే సర్కారు బడిలోనే పిల్లలకూ చదువులు ● ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న గురువులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వ బడిలో పాఠాలు చెప్పడమే కాదు... తమ పిల్లలను కూడా సర్కారు బడిలో చేర్పించి చదువులు చెప్పిస్తున్నారు కొందరు టీచర్లు. ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి వారు సైతం అప్పో సప్పో చేసి తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ బడులు, కళాశాలలకు పంపిస్తున్నారు. మరి ప్రభుత్వ ఉద్యోగులైతే.. మరింత పేరున్న సంస్థల్లో చదివిస్తున్నారు. అందులో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పుతున్నారు. తమ పిల్లల చదువుల కోసమే అనేకమంది తమ సొంత ఊళ్లను వదిలి నగరాల్లో స్థిరపడిపోతున్నారు. అయితే సర్కారు విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకునే చర్యల్లో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీఏటా బడిబాట కార్యక్రమాలతో గ్రామాల్లోకి వెళుతున్నారు. ఆ సమయంలో 'మీ పిల్లలనేమో ప్రైవేటుబడికి పంపుతారా? మా పిల్లలేమో సర్కారు బడికి పంపాలా?' అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి ఎదురవుతున్నాయి. కానీ ఇలాంటి పరిస్థితుల్లో తమ పిల్లలను సర్కారు బడుల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులపై 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం.

సకల సౌకర్యాల సర్కారు బడి...

ప్రభుత్వ బడిలో అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. బోధనలో నిష్ణాతులైన ఉపాధ్యాయులనే ప్రభుత్వం నియమిస్తుంది. దీంతోపాటు ప్రభుత్వం మన ఊరు.. మన బడి, మన బస్తీ- మన పాఠశాల, పీఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అనేక పాఠశాలల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. విద్యార్థులకు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా కొన్నిచోట్ల ప్రభుత్వ బడుల్లో కూడా డిజిటల్ విద్యను అందిస్తున్నారు. ఉచితంగా స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అందిస్తుండటంతో చాలా ప్రాంతాల్లో ప్రైవేట్ నుంచి విద్యార్థులు ప్రభుత్వ బడికి మారేందుకు ఆసక్తి చూపుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో డీఎడ్, బీఎడ్, ఎంఎడ్ తదితర ఉపాధ్యాయ శిక్షణ కోర్సులను పూర్తి చేసిన వారినే టీచర్లుగా నియమిస్తోంది. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పాఠాల బోధన జరుగుతోంది. దీంతో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా పునరాలోచనలో పడ్డారు. తాము విద్యార్థులను బడిలో చేర్పించాలని ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు.. 'మీ పిల్లలను ప్రభుత్వ బడిలో ఎందుకు చేర్చరు..' అని తల్లిదండ్రుల నుంచి ఎదురైన ప్రశ్నలకు కొందరు సమాధానం ఇస్తున్నారు. తాము చెప్పే విద్యనే తమ పిల్లలకు కూడా అందించాలనే తాపత్రాయంతో ఉమ్మడి జిల్లాలోని చాలామంది టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించే ఆర్థికస్థోమత ఉన్నా ప్రభుత్వం పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కితాబివ్వడమేకాదు.. ప్రజల్లోనూ నమ్మకం కలిగించేలా తమ పిల్లలను సర్కారు బడిలో చదివిస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ బడిలో ఉండే ఇంగ్లీషు మీడియం సర్కారు బడిలో కూడా ఉండటంతో ఇతర పిల్లలను కూడా ప్రోత్సహిస్తూ సర్కారు బడిలో చదువుకునేలా కృషి చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

'మేం 1వ తరగతి నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యనే అభ్యసించాం. ఏ ఒత్తిడి లేకుండా చదువుకుని ఉపాధ్యాయులుగా స్థిరపడినాం. మా పిల్లలకు ఒత్తిడి లేని చదువు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాం.. మా ఇద్దరు పిల్లలను సర్కారు బడిలోనే చదివిస్తున్నాం' అని ఉపాధ్యాయ దంపతులు శ్యామలత, రాజు చెబుతున్నారు. శ్యామలత మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రాపల్లి జడ్పీఎస్ పాఠశాలలో, రాజు గూడూరు మండలం గుండెంగ ప్రాథమికొన్నత

ఒత్తిడి లేని చదువు ప్రభుత్వ బడిలోనే..

పాఠశాలలో గణితం టీచర్లుగా పని చేస్తున్నారు. వారి ఇద్దరు పిల్లలు హిమాన్షుసహన్, కొవిద్‌సహన్ వరంగల్‌లోని చార్‌బౌలి ప్రభుత్వ పాఠశాలలో ఆరు, ఎనిమిది తరగతులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో హోం వర్క్ పేరుతో విద్యార్థులపై ఒత్తిడి ఉంటుందని ఆ ఉపాధ్యాయ దంపతులు అంటున్నారు. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే అయినా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో టీజీటీగా పని చేస్తున్న సుధారాణి తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చదివిస్తున్నారు. తన కుమారుడు సుమితేష్ 8వ తరగతి, కుమార్తె సంవిద 6వ తరగతి టీజీఎంఎస్‌లో చదువుతున్నారు. అలాగే ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న ఎం.వెంకటేశ్వరాచారి తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. ఇదే గ్రామంలోని జడ్పీఎస్

ఇద్దరు పిల్లలు సర్కారు బడికే..

పాఠశాలలో కుమారు చైతన్యరిషి 8వ తరగతి చదువుతుండగా, కుమార్తె ఆరాధ్య 6వ తరగతి చదువుతోంది. చైతన్యరిషి 2వ తరగతి నుంచి, ఆరాధ్య 1వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. తాను చదువు చెప్పే సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య ఉందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నామని ఆ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆ ఉపాధ్యాయుల పిల్లలంతా సర్కారుకే..

మరిపెడ మండలం సీతారాంపురంతండా, మరిపెడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. మరిపెడ జడ్పీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నందిగామ జనార్దనాచారి తన కుమార్తె సరస్వతిని పదోతరగతి, మరో ఉపాధ్యాయుడు సారయ్య తన కుమార్తె దేవిని ఏడోతరగతి, ఉపాధ్యాయుడు లాల్‌చంద్ తన కుమార్తె మైథిలీని ఏడోతరగతి, కె.వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల పిల్లలు మరిపెడ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇస్మిత 8వ తరగతి, హర్షద్ 7వ తరగతి చదివిస్తున్నారు. వీరే కాకుండా దంతాలపల్లి జడ్పీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ పండిట్ డి.పరంకుశచారి 9వ తరగతి చదువుతున్న తన కుమార్తె సిరిచందనను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. అలాగే కొత్తగూడ మండలానికి చెందిన పుల్సం కవిత తన కుమార్తె సాహిత్యను గూడూరుకు చెందిన ఉపాధ్యాయుడు తాటి బుచ్చిరాములు తన ఇద్దరు పిల్లలు వేదశ్రీ 2వ తరగతి, గాయత్రి 1వ తరగతిలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జడ్పీఎస్ పాఠశాలలో స్టాలిన్ బేగ్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన స్టాలిన్‌బేగ్ తాను పాఠాలు చెప్పుతున్న బడిలోనే తన ఇద్దరు పిల్లలను కూడా చదివిస్తున్నారు. ఇటీవలే భీమదేవరపల్లి పాఠశాలలో కుమార్తె పదో తరగతి పూర్తి చేయగా.. కుమారుడు తల్హార్‌బేగ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

తాను చదువు చెప్పే బడిలోనే..

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్న స్టాలిన్‌బేగ్ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రైవేట్ బడిలో ఉండరని, ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణ విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకంగా ఉంటుందని స్టాలిన్‌బేగ్ పేర్కొంటున్నారు.



కారులో కూరగాయల విక్రయం



కారులో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

జూలైవాడ, జూలై 27: కూరగాయలను సైకిళ్లు, తోపుడు బండ్లపై వాడవాడల తిరుగుతూ విక్రయించేవారు. ఎలాంటి అద్దె ఖర్చు లేకుండా మొబైల్ వాహనాలపై వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా శాతం వాహనాలపై ఉదయం, సాయంత్రం వేళల్లో టిఫిన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఓ యువకుడు వినూత్నంగా ఆలోచించి కారునే కూరగాయల విక్రయ కేంద్రంగా మార్చుకున్నాడు. శనివారం హనుమకొండ గ్రేటర్ 59వ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో ఖరీదైన కారులో వివిధ రకాల కూరగాయలు విక్రయిస్తూ పలువురిని ఆకర్షించాడు. కారు వెనుక డిక్కీలో తూకం మిషన్ ఏర్పాటు చేసుకొని కూరగాయలు విక్రయిస్తున్నాడు.

పెండింగ్ స్లాట్‌లకు హాజరుకావాలి..

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల

వరంగల్ క్రైం, జూలై 27: హనుమకొండ రవాణా శాఖ కార్యాలయంలో జనవరి 2020 నుంచి ఇప్పటి వరకు స్లాట్ బుక్ చేసుకున్న అప్లికేషన్లు 1,263 పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి హాజరుకావాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్ పుప్పాల ఒక ప్రకటనలో కోరారు. వాహన యజమానులు, డ్రైవింగ్ లైసెన్సుదారులు రవాణాశాఖ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుని, ఫీజు చెల్లించి కార్యాలయానికి వచ్చి డ్రైవింగ్ టెస్ట్, వాహన ఇన్స్‌స్పెక్షన్ వంటివి చేయించకపోవడం వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీని వలన ఏదైనా న్యాయపరమైన సమస్యలు, ఇన్సూరెన్స్ సమస్యలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు చింతగట్టు క్యాంపు వద్ద ఉన్న కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని శ్రీనివాస్ సూచించారు.

కమిషనరేట్‌లో ముగ్గురు సీఐల బదిలీ

వరంగల్ క్రైం, జూలై 27: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఒ.రమేశ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, పి.దామోదర్ కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, ఎం.రంజిత్‌కుమార్ కమిషనరేట్ నుంచి వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు కేటాయించారు.

ఎంజీఎం మాజీ సూపరింటెండెంట్ బదిలీపై వెలసిన ఫ్లెక్సీలు



వరంగల్ మెడికల్, జూలై 27: ఇటీవల ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా బదిలీ కావడంపై ఎంజీఎం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇన్ని రోజులు ఎంజీఎంకు పట్టిన పీడ విరగడ అయిందంటూ ఎంజీఎం గేటుకు ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. కాగా, ఈ ఘటన పెద్దాస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది.

ఎన్పీడీసీఎల్ స్టోర్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ

హనుమకొండ టౌన్, జూలై 27:ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన విద్యుత్ సామగ్రిని సరఫరా చేసే స్టోర్‌ను హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీఅండ్‌డీ వర్క్స్ కొత్త సర్వీసుల రిలీజ్‌లు, ఇతరత్రా అవసరాలు తీర్చడానికి స్టోర్‌లో మెటీరియల్ లభ్యతపై ఆరా తీశారు.

విద్యార్థి సంఘ నాయకులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై27: కొందరు విద్యార్థి సంఘాల పేర్లు చెప్పుకుంటూ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలను డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఆర్‌టీఏ, బీఎస్ఎఫ్, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల అధ్యక్షులు తమ కళాశాలలకు వచ్చి చందాల వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. చందా ఇవ్వని కళాశాలల ముందు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనే పేరుతో ధర్నాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. నిరుద్యోగులైన తాము ప్రైవేట్ కళాశాలలు పెట్టుకుని ఉపాధి పొందుతూ ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, కొందరు కుల సంఘాల నాయకులు ఆర్‌టీఏ యాక్ట్ కింద నోటీసులు ఇస్తూ తమను ఒత్తిడి గురి చేస్తున్నారన్నారు. వెంటనే ఈ విద్యార్థి సంఘాల నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి రాజు, గౌరవ సలహాదారులు గౌరు తిరుపతిరెడ్డి, కుమార్, రాజిరెడ్డి, రాంమూర్తి, కరుణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, తాళ్లపల్లి స్వామి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు



అవార్డులు పొందిన ఉద్యోగులు

బాలసముద్రం, జూలై 27: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను శనివారం హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ధరమ్‌సింగ్ మాట్లాడుతూ.. ఇంధనాన్ని పొదుపుగా వాడి ఆదాయం తెచ్చి సంస్థను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు తమ ప్రతిభను కనబరిచి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియాసుల్తానా, మెకానిక్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు

అలంకారప్రాయంగా టీ డయాగ్నోస్టిక్ సెంటర్లు

- రేడియాలజీ పరీక్షలు లేవు..
- ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందే..
- డిప్యూటేషన్ సిబ్బందితో సరి



నిరుపయోగంగా ఉన్న రేడియాలజీ సెంటర్

వరంగల్ మెడికల్, జూలై 27: పేద రోగుల సౌకర్యార్థం అట్టహాసంగా ప్రారంభించిన టీడయాగ్నోస్టిక్ కేంద్రం సిబ్బంది కొరతతో విలవిలలాడుతోంది. రేడియాజిస్టు వైద్యులు లేక సేవలు నిచిలిపోయాయి. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం కళ్ల ముందే నీరుగారిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఎన్నో ఆశలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు రేడియాలజీ సేవలు లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రంపై కథనం.

రేడియాలజీ వైద్యుడు కరువు

ప్రతీ వైద్య చికిత్సలో రేడియాలజీ విభాగానికి అత్యంత ప్రాధాన్యముంటుంది. ఇందులో ప్రధానంగా ఈసీజీ, మెమోగ్రఫీ, అబ్డామిన్ స్కాన్, ఎక్స్‌రే మిషన్లు ఉన్నాయి. కానీ రేడియాలజీ వైద్యులు లేకపోవడంతో ఇవన్నీ మూలనపడ్డాయి. సిటీ, ఎంఆర్ఐ పరికరాలు ఇంతవరకు మంజూరు కూడా కాలేదు. రేడియాలజీ వైద్యుడి కోసం రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదని హబ్ నిర్వాహకులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రత్యేక చొరవ చూపితే డిప్యూటేషన్‌పై ఓరేడియాలజీని పంపించే అవకాశం ఉన్నప్పటికీ చొరవ చూపకపోవడంతో విభాగం సేవలు నిల్‌గా మారాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు విభాగాలు మాత్రమే..

టీహబ్‌లో రేడియాలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విభాగాలు ఏర్పాటు చేశారు. వీటితో రేడియాలజీ విభాగానికి వైద్యుడు లేకపోవడంతో మొదటి నుంచి మూతపడింది. ఇక బయోకెమిస్ట్‌గా పని చేస్తున్న వైద్యులు ఇటీవల బదిలీల్లో వెళ్లిపోవడంతో ఆ విభాగం మూతపడే దశలో ఉంది. ప్రస్తుతం పాథాలజీ, మైక్రో బయాలజీ విభాగాలు మాత్రం ఏడుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

నిత్యం వేయి శాంపిళ్లు

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్బన్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఈహెచ్ఎస్, ఇలా 33మార్గాల ద్వారా శాంపిళ్లు టీహబ్‌కు చేరుకుంటాయి. స్టెరిలైజేషన్ కోల్డ్ స్టోరేజ్ కలిగిన మూడు వాహనాలు కూడా ప్రతీరోజు మూడు రూట్లలో వెళుతు సాయంత్రం 4గంటల వరకు శాంపిళ్లను సేకరించి, ఆధార్, ఫోన్ నెంబర్లను అనుసంధానం చేస్తున్నారు. పరీక్ష ఫలితాలను నేరుగా వారి మొబైల్‌లకు మెసేజ్ ద్వారా వెళుతున్నాయి.

మల విసర్జన పరీక్షలు లేవు

57 రకాల పరీక్షలు తెలంగాణ హబ్‌లో నిర్వహిస్తున్నప్పటికీ మలవిసర్జన పరీక్షలు మాత్రం రియజెంట్స్ లేవనేసాకుతో కొద్దికాలంగా పరీక్షలు నిలిపివేశారు. ప్రోటీన్ టెస్ట్, హెచ్‌బీ పర్సంటేజ్ టెస్టులు కూడా జరగడం లేదు.

మూలనపడ్డ మిషన్లు

టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో కల్చర్ మిషన్, ఎలక్ట్రోఫోర్స్, కాంగ్లో మీటర్ మిషన్లు మూలనపడ్డాయి. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఏడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రోగుల తాకిడికి అనుకూలంగా టెక్నీషియన్లను నియమించాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. మిషన్ కూడా బ్రేక్‌డౌన్ అవుతున్నట్లు టీ హబ్ ఉద్యోగులు వాపోతున్నారు. టీ హబ్‌లో మౌలిక సదుపాయాల మెరుగు కోసం అధికారులు కృషి చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులు చట్టాలపై
అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సరిత

● జూనియర్ సివిల్ జడ్జీ సరిత

నెల్లికుదురు, జులై 27 : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ మట్ట సరిత తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సెర్ప్ కార్యాలయంలో మహిళ సంఘాల సభ్యులకు గృహహింసపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు, అసాంఘీక కార్యకలపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. సెల్‌ఫోన్ మోజులో జీవితాలను వృధా చేసుకోవద్దన్నారు. మంచిపనులకు మాత్రమే సెల్ ఫోన్‌లు వినియోగించకోవాలన్నారు. బాల్యవివాహాలు చట్టవిరుద్ధమన్నారు. బాలికలు,మహిళలు అపరిచితవ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. భర్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు నెలకుంటే కోర్టును ఆశ్రయిస్తే న్యాయం జరుగుతందన్నారు. గృహహింసచట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గృహహింసకు గురైన పేద మహిళలకు ప్రత్యేకమైన న్యాయవాదులచే కోర్టులో కేసు వేయించి న్యాయం చేస్తామన్నారు. స్వల్ప తగాదాలతో కేసుల పాలు కావద్దన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కవిరాజు, ఎస్సై రమేష్‌బాబు, ఏపీఎం వరదయ్య, అధ్యాపకులు విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తిరుపతి

కేసముద్రం : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తిరుపతి అన్నారు. తాళ్లపూసపల్లి ఉన్నతపాఠశాలలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అవగాహనతో ఎటువంటి సమస్యలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలని అన్నారు. ఎస్సై మురళీధర్‌రాజ్, హెచ్ఎం కోట కనకయ్య, కోర్టు కానిస్టేబుల్ నరేందర్ పాల్గొన్నారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

● రామోజీతండా-పోచంపల్లి బీటీ రోడ్డు పనులపై నిర్లక్ష్యం ● అవస్థలు పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కంకరపోసి వదిలేసిన రామోజీతండా- పోచంపల్లి రోడ్డు

పెద్దవంగర, జూలై27 : బీటీ రోడ్డు నిర్మాణం ఆలస్యం కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ పనులు సకాలంలో పూర్తి చేయకుండా కంకరపోసి వదిలేయడంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కంకర పోసి ఉన్న రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. రామోజీ తండా నుంచి ఎనిమిదితండా తండా మీదగా పోచంపల్లి వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. పనులు పూర్తిచేసే విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ చొరవ చూపడంలేదని ఆయా తండాల గిరిజనులు వాపోతున్నారు. కంకరపోసి వదిలేసిన రోడ్డుపై నిత్యం వెళ్లే వాహనాలతో దుమ్ములేచి అనారోగ్యానికి గురువుతున్నామని ఆయా తండాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021లో రామోజీతండా నుంచి ఎనిమిదితండా తండా మీదగాపోచంపల్లి వరకు 4.43 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.48 లక్షలు మంజూరు చేసింది. సుమారు సంవత్సరం క్రితం బీటీ రోడ్డు పనులును ప్రారంభించారు. కాగా, మంజూరైన నిధులతో రామోజీతండా నుంచి ఎనిమిదితండా తండా మీదగా పోచంపల్లి వరకు కంకర పోసి బీటీ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశారు. దీంతో గత కొంత కాలంగా ఆయా తండాల ప్రజలు, వాహనదారులు అవస్థలుపడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని అసంపూర్తిగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణపనులను పూర్తి చేయాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి
- జాటోతు వెంకటేష్, రామోజీతండా



కంకర రోడ్డుపై నుంచి వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ముధూళి విపరీతంగా వస్తోంది. అది ముక్కు, నోట్లోకి వెళ్లి అనారోగ్యం పాలవుతన్నాం. రాత్రివేళ ఆ రోడ్డుపై వెళ్లాలన్నా భయమేస్తుంది. కంకరపోసి ఉన్న రోడ్డుపై ఇబ్బందులు పడు తూ ప్రయాణం సాగిస్తున్నాం. త్వరగా బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి
జాటోతు సుమన్, రామోజీతండా



బీటీ రోడ్డు నిర్మాణ పనుల పట్ల నిరక్ష్యం వహిస్తున్న సం బంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రామోజీతండా-పోచంపల్లి రోడ్డు అసంపూర్తిగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

త్వరలోనే పనులు చేపట్టేలా చర్యలు
సురేష్, పీఆర్ ఏఈ

బిల్లులు అలస్యంగా రావడంతో నిర్మాణ పనుల పట్ల కాంట్రక్టర్ జాప్యం జరుగతుందని కాంట్రాక్టర్ తెలిపాడు. అసంపూర్తిగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. గిరిజనులకు మెరుగైన రోడ్డు కల్పిస్తాం.

'గార్ల'వాసికి అరుదైన అవకాశం
(5వ పేజీ తరువాయి)

చేసిన సేవలను గుర్తించి, స్పెషల్ కన్సల్టేటీవ్ స్టేటస్‌ను ఇచ్చింది. 2020-21న అప్రూవల్ ఫర్ ది ఎకనామిక్, సోషల్ అఫైర్, రెగ్యూలర్ సెషన్ రిలిజీయస్, అండ్ లింగ్విస్టిక్ మైనార్టీస్, యునైటెడ్, నేషన్ హెడ్యర్టర్స్ అనే అంశాలపైన సెమినార్లలో జోగిరాంనాయక్ పాల్గొన్నాడు. ప్రముఖులు, మేధావులు వివిధ సంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి
● సీహెచ్‌వో కృష్ణార్జునరావు

మహబూబాబాద్ టౌన్, జూలై 27 : సీజనల్ వ్యాదులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి వాటిని అరికట్టాలని వైద్యశాఖ కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు సూచించారు. కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సీ), మునిసిపల్ పరిధి ఈదులపూసపల్లిలోని ఆయుష్మాన్ మందిర్‌ను శనివారం సందర్శించారు. అక్కడ వైద్యసిబ్బందిలో మాట్లాడి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు కుట్టడంతో వ్యాధులు సంబవిస్తాయని, దోమతెరలు వాడాని సూచించారు. వేడివేడిగా వండిన పదార్థాలను భుజించాలని తెలిపారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, సౌజన్య పాల్గొన్నారు.

గుండెపోటు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి


గుండెపోటుపై అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో, వైద్యాధికారులు

● డీఎంఅండ్‌హెచ్‌వో బి.కళావతిబాయి

నెహ్రూసెంటర్, జూలై 27 : గుండెపోటు పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) బి.కళావతిబాయి సూచించారు. ప్రపంచ కార్డియోపల్మోనరీ రిససిటేషన్ దినోత్స వాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళావతిబాయి మాట్లాడుతూ సడన్‌కార్డియాక్ అరెస్ట్ (ఎస్‌సీఏ) అనేది గుండెలయ అపక్రమంగా మారడం కారణంగా గుండె పనులు అకస్మీకంగా కోల్పో వడంతో శ్వాస ఆగిపోతుందన్నారు. అటువంటి వ్యక్తి స్పృహకోల్పోతాడని, తక్షణ నిర్వహణ లేనట్లయితే ఆకస్మిక గుండెపోటు వ్యక్తి మరణానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. వేగంగా సరైన వైద్యసంరక్షణ అందించడం వల్లే బతికే అవకాశం సాధ్యమవుతుందన్నారు. ఛాతి దగ్గర నొక్కడం, రెస్క్యూ శ్వాసలు ఒకదాని తర్వాత ఒకటి ఇవ్వాలని, అత్యవసర వైద్య సేవలు అందే వరకు శరీరమంతా ఆక్సీజన్‌తో కూడిన రక్తాన్ని ప్రసరింప చేయడంలో సహాయ పడుతుందన్నారు. నలంద కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు, శ్రావణ్‌కుమార్, కొప్పు ప్రసాద్, మంగమ్మ, శ్రీనివాస్, రామకృష్ణ, ప్రసాద్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లకుంట చెరువును ఆక్రమించేందుకు యత్నాలు

మహబూబాబాద్ టౌన్, జూలై 27 : మునిసిపల్ పరిధిలోని బేతోలులోని నల్లకుంట చెరువును ఆక్రమించేందుకు కొంతమంది వ్యక్తులు అందులో మట్టి పోస్తున్నారని బేతోలు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం బాధ్యుడు ఎస్.కృష్ణయ్య, వెంకన్న, రామారావు ఆరోపించారు. నల్లకుంట చెరువును ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకార్మికులు, రైతుల జీవనాధారంగా ఉన్న నల్లకుంట చెరువును రజాలిపేటకు చెందిన దళారులు దానిలో మట్టిపోసి పూడుస్తున్నారని వారిపై చట్టరీత్యాచర్యలు తీసుకుని చెరువును కాపాడాలని కోరారు. సంపత్, యాకన్న పాల్గొన్నారు.

జిల్లాలో 91.2 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 27 : చిన్నపాటి వర్షాలు, వానలు, ముసురు జిల్లాను వీడడం లేదు. శనివారం దట్టమైన మబ్బులు చేసి చిన్నపాటి వర్షాలు కురుస్తూ ఉన్నాయి. శుక్రవారం రాత్రి కొత్తగూడ, మహబూబాబాద్, గంగారం మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. శనివారం ఉదయం 8.30 గంటల వరకు వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడలో 25.6, గంగారంలో 24.2, బయ్యారంలో 9.8, గార్లలో 3.8, డోర్నకల్‌లో 2.4, మహబూబాబాద్‌లో 12.2, గూడూరులో 7.0, కేసము ద్రంలో 3.4, నెల్లికుదురులో 1.6, తొర్రూరులో 1.2, వెరసి 91.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 5.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కేంద్రప్రభుత్వ ప్రజావిధానాలను ఎండగట్టాలి
● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 27 : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జమాండ్లపల్లిలో సీపీఎం గ్రామ కార్యదర్శి ఎలికట్టి సైదులు అధ్యక్షతన శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని విమర్శించారు. పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, చీపిరి యాకయ్య, రాజేశ్వరి, నిజాం, సురేష్, మదీనా, బొమ్మగాని మహేష్, అప్పయ్య, లక్ష్మణ్, సుభద్ర, తిరుపతమ్మ పాల్గొన్నారు.

అనారోగ్యంతో రిటైర్ట్ వ్యవసాయాధికారి మృతి


సత్యనారాయణరెడ్డి (ఫైల్)

మహబూబాబాద్ టౌన్, జూలై 27 : మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి సోదరుడు రిటైర్డ్ వ్యవసాయాధికారి, బాస్కెట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు వెన్నం సత్యనారాయణరెడ్డి (72) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మానుకోట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. మృతుడికి ముగ్గురు కుమారులు సంతానం. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మానుకోట మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, జర్నలిస్టు సంఘం నాయకులు పర్కాల రవీందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రిటైర్డ్ పీడీ గోపు సమ్మయ్య, సీనియర్ క్రీడాకారులు చీకటి చంద్రయ్య, వంగ రామన్న, వెంకటరమణ, డాక్టర్ బి.వెంకట్రాములు, మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం తదితరులు ఈదులపూసపల్లికి చేరుకుని సత్యనారాయణరెడ్డి మృతదేహంపై పుష్పగుచ్చాలుంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం


బదిలీపై వెళ్తున్న అధికారులను సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు

గూడూరు, జూలై 27 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎంపీవో చంద్రమోహన్, సూపరిండెంట్ కరణ్‌సింగ్, జూనియర్ అసిస్టెంట్ ఇమామ్, టైపిస్టు నాగరాజు, కార్యదర్శులు అలీ, విజేత, మంజుల, మల్లేష్‌కు శనివారం అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరస్వామి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారణమే అన్నారు. ఎక్కడ పనిచేసినప్పటికి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు కత్తిస్వామి, బోడ కిషన్, నూకల రాధికసురేందర్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మహబూబాబాద్ టౌన్, జూన్ 27 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అర్బన్ పీహెచ్‌సీ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మహబూబాబాద్ మునిసిపల్ 17వవార్డు పరిధిలోని జగ్జీవన్‌రామ్‌కాలనీలో డెంగీ పాజిటివ్ కేసు నమోదు కావడంతో మునిసిపల్ కమిషనర్, వైద్యాధికారుల ఆదేశాలతో సదరుకాలనీలో శనివారం వైద్యసిబ్బంది బ్లీచింగ్ పౌడర్‌చల్లి, పైరిత్రిమ్ స్ప్రే చల్లారు. కాలనీ వాసులకు సీజనల్ వ్యాధుల గూర్చి అవగాహన కల్పించి నివారణ చర్యలు వివరించారు. డాక్టర్ రమ్యశ్రీ, హెచ్‌ఈవో వొబిలిశెట్టి రామకృష్ణ, సిబ్బంది మమత, జనని, జ్యోతి, శ్యామల, మునిసిపల్ సిబ్బంది చెడుపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 27 : కులం, ఆదాయం, నివాస సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సకాలంలో అందించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. మానుకోటలో శనివారం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడాకె. మానుకోట తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఓ అధికారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తు తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. దీంతోవిద్యార్థులు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సిద్ధు, హేమంత్, అఖిల్, ప్రణయ్, రామ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు సీసీ రోడ్డు నిర్మించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 27 : జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌కు వెళ్లేదారి బురదమయంగా ఉందని, వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు డిమాండ్ చేశారు. స్థానిక హాస్టల్స్‌కు వెళ్లే దారి బురదమయంగా ఉండటంతో శనివారం సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో విద్యార్థులు హాస్టల్స్‌కు వెళ్లాలంటే బురదలోనుంచి వెళ్లాల్సి వస్తుందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విజయ్, బాలకృష్ణ, తరుణ్, ప్రవీణ్, నవీన్, ప్రశాంత్, గోపి పాల్గొన్నారు.

దివంగత అబ్దుల్ కలాం వర్ధంతి

మహబూబాబాద్ టౌన్, జూలై27 : మహబూబాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుట నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సేవా సమితి జిల్లా వ్యవ స్థాపకుడు కందుల నాగరాజు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ మేధావి కలాం అని కొనియాడారు. విశ్రాంత సైనికులు సత్యనారాయణ, కేశవరావు, గంగాధర్, సామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలాం మానవత వాది


డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలోని అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్మన్ వాంకుడోతు వీరన్న

● డోర్నకల్ : భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి పురస్కరించుకుని శనివారం డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ వాంకుడోతు వీరన్న అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్‌కలాం దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని, మనవాత విలువలు గల సంపూర్ణ వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బసిక అశోక్, జర్పుల వీరన్న, మునిసిపల్ ఏఈ బాబు, శానిటరి ఇన్‌స్పెక్టర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

● డోర్నకల్ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ వాజీద్ ఆధ్వర్యంలో ముస్లీంలు అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళ్లర్పించారు. మహ్మద్ ఖాసీం, షేక్. ముక్తార్, ఫిరోజ్, నవాబ్, షకీల్, అజీమ్, సజాద్, నాజీమ్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

మహబూబాబాద్ టౌన్, జూలై 27 : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో కార్మికుల వేతనాలు, సంక్షేమం, ఇతర సౌకర్యాల గూర్చి ప్రస్తావించకపోవడం సరైంది కాదని సీఐటీయూ రాష్టర కోశాధికారి వంగూరి రాములు అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శనివారం సీఐటీయూ జిల్లా వర్క్ షాప్‌ను ఆకుల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట నాయకులు కాసు మాధవి, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, కందునూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి వీరన్న, నాగన్న,మల్లయ్య, స్నేహబిందు, శ్రీశైలం, మల్లెశం, వెంకన్న, జయరాజు, వెంకన్న, సుధాకర్, ఉప్పలయ్య సుధాకర్, శ్రీనివాస్, సుజిత పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహార దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సీరోలు, జూలై 27 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రధానోపాధ్యాయుడు విత్తనాల సుధాకర్ అన్నారు. మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షాసప్తాహ్‌లో భాగంగా పౌష్టికాహారం దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు జొన్నరొట్టెలు, కుడుములు, పల్లిపట్టి, సేమియా మొదలగువంటలు, పిండి పదార్థాలు చేసుకువచ్చారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ విటమిన్‌లు, ప్రొటీన్లు ఉండే ఆహార పదార్థాలు, తినుబండారాలను తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉండవచ్చని సూచించారు. ఉపాధ్యాయులు హచ్య, ప్రశాంతి, విజయకుమారి, నర్సయ్య, లక్ష్మీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ అరుణ, కపిల్ పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండిచేయి'

కురవి, జూలై 27 : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండిచేయి చూపాయని దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ ఖాజా విమర్శించారు. శనివారం కురవిలో కందిపాటి ఉమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకారం.. దివ్యాంగులకు 5 శాతం నిధులు కేటాయించాలని కానీ ప్రభుత్వాలు నయా పైసా పెంచలేదన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చినప్రభుత్వాలు అమలు చేయడం విఫలమయ్యాయన్నారు. బడ్జెట్ పెంచకపోవడం వల్లపింఛన్‌లు ఇవ్వకపోవడంతో దివ్యాంగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి నిధులు కేటాయించాలన్నారు. కర్నాటి మల్లికార్జున్, బత్తిని వెంకన్న, సీతారామయ్య, కందిపాటి శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలి
● తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి రవి

కొత్తగూడ, జూలై 27 :ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వమే నిధులు కేటాయించి అధికారికంగ నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. కొత్తగూడలో శనివారం నిర్వహించిన సమావేశంలో రవి మాట్లాడుతూ ఆడవిలో ప్రత్యేక సాంస్కృతిక, సాంప్రదాయలు, ఆచారాలు, జీవన విధానం కలిగిన ఆదివాసీలు జీవిస్తుంటారన్నారు. ఆదివాసీలను అభివృద్ధిలోకి తీసుకురావాలనే నిశ్చయంతో ఐక్యరాజ్యసమితి 1982లో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించారని పేర్కొన్నారు. ఆదివాసీలు ప్రతీ గూడెంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, మాఊర్లో మారాజ్యం అనే నినాదంతో ఐక్యతనుచాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన భిక్షం, ఉద్యోగ సంఘం నాయకులు ముడిగె రాంచందర్, చుంచ మహేందర్, తుడుందెబ్బ నాయకులు అల్లెం జంపయ్య, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'పీఆర్‌టీయూ సభ్యత్వమే ఒక వరం'

మరిపెడ రూరల్ జూలై 27 : పీఆర్‌టీయూ సభ్యత్వమే ఒక వరంలాంటిందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఎల్లంపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమ కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గండి కరుణాకర్, గుర్రం వెంకన్న, గుగులోతు వెంకన్న పాల్గొన్నారు.

ఎరువుల కొనుగోలుకు ఆధార్ తప్పనిసరి

మరిపెడ, జూలై 27 : ఎరువుల కొనుగోలుకు రైతులు తప్పనిసరి ఆధార్ కార్డు తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి వీరాసింగ్ అన్నారు. శనివారం మరిపెడ మండల ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన మరిపెడబంగ్లాలో ప్రారంభించి, మాట్లాడారు. రైతులు డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తే రశీదు తీసుకోవాలన్నారు. ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాలం శ్రీనివాస్ రెడ్డి, చల్లా హరీశ్, సురేందర్, ఉప్పల కృష్ణమూర్తి, గొంద్రాల అంబరీశ, ప్రసాద్, గర్రెపల్లి శ్రీనివాస్, రమేశ్‌రెడ్డి, ఉల్లి శ్రీనివాస్, వెంకన్న, ఉపేందర్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

తొర్రూరు, జూలై 27 : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పేరు లేకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గాంధీ సెంటర్‌లో ప్రధాని మోదీ ఫ్లెక్సీని దిష్టిబొమ్మగా చేసి దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సంతోష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సోమరాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతూ నిధులు మంజూరు చేయలేదన్నారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, రోజా ప్రభుదాస్, రాము, గజానంద్, శ్రీనివాస్, రవీంద్రాచారి, నల్లపు రాజు, తూనం శ్రావణ్, కొముర‌య్య, నరేందర్ రెడ్డి, సురేష్, దొంగరి శంకర్, బిజ్జాల అనిల్, వెంకన్న, మధు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలి

తొర్రూరు, జూలై 27 : డ్రైవర్లు ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేయాలని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి అన్నారు. శనివారం డిపో ఆవరణలో ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, మెకానిక్‌లను సత్కరించారు.ఆమె మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉందని, బస్సులను కండీషన్‌లో ఉంచాలన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైవర్లు అప్రమత్తత పాటిస్తూ ప్రమాదాలు నివారించాలని తెలిపారు. డ్రైవింగ్‌లో ప్రతిభ కనబర్చిన వారిని శాలువా మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్, సయ్యద్, గ్యారేజీ సిబ్బంది, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను ప్రారంభించాలి

తొర్రూరు, జూలై 27 : తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో మంజూరైన పెండింగ్ పనులను ప్రారంభించాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మునిసిపాలిటీ అభివృద్ధికి మాజీమంత్రి దయాకర్‌రావు ఎస్‌డీఎఫ్ నుంచి రూ.25కోట్లు, టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.65 కోట్ల నిధులు మంజూరు చేయించారని, పట్టణ అభివృద్ధికి పనులు ప్రారంభించాలని కోరారు. నాయకులు అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీను, శంకర్, జైసింగ్, జంపా, మణిరాజ్, దామోదర్ రెడ్డి, కుమారస్వామి, భూపతి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాల ఫస్టీయర్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్స్

మరిపెడ, జూలై 27 : మునిసిపల్ కేంద్రంలోని ఎస్టీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాల ఫస్టియర్ అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జలగం సతీశ్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు మూడుసెట్ల జిరాక్స్ ప్రతులు, పాస్‌ఫోటోలు వెంట తెచ్చుకోవాలని కోరారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ బీజడ్‌సీ, బీఎస్సీ ఎంపీసీలోని ఖాళీలను దరఖాస్తుల ప్రాధాన్యతతోనే భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెంకట్రాంపురం సబ్‌సెంటర్‌లో హెల్త్‌క్యాంప్
● సంగ్యాతండాను సందర్శించిన పీవో
● 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్టు


బాల్యతండాలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

బయ్యారం, జూలై 27 : సబ్‌సెంటర్ పరిధిలోని సంగ్యాతండా, బాల్యతండాలో శనివారం వైద్య సిబ్బంది హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేసి, రోగులను పరీక్షించి మలేరియా రక్తనమూనాలు సేకరించారు. బయ్యారం మండలంలో పారిశుధ్యం లోపించి వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్న నేపథ్యంలో శనివారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో 'ఇంటింటా జ్వర పీడితులే' శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన వైద్యాధికారులు వెంకట్రాంపురం సబ్ సెంటర్ పరిధిలో ఇంటింట ఫీవర్ సర్వేతో పాటు హెల్త్ క్యాంపు కండక్ట్ చేశారు. సంగ్యాతండాలో ముగ్గురు, బాల్యతండాలో 7 గురు జ్వరపీడితుల నుంచి మలేరియాకు సంబంధించిన రక్తపరీక్షలు నిర్వహించారు. దీంతో పాటు ఇంటింటికి ఫీవర్ సర్వే చేపట్టారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సంగ్యాతండాలో నిర్వహించిన ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని ఎన్‌సీపీటీడీసీ పీవో సుధీర్‌రెడ్డి పరిశీలించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేలా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదే శించారు. బయ్యారం పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్‌తోపాటు వైద్య సిబ్బంది నవీన్, నాగుల్‌మీరా, అరుణ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో బంగారుపతకం


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కేసముద్రం, జూలై 27 : కేసముద్రం విలేజి శ్రీవివేకవర్థిని హైస్కూల్‌కు చెందిన కందాల వర్షిని, తోకల సౌమ్య షావోలిన్ టైగర్స్ కుంగ్‌ఫూఇంటర్నేషనల్ నిర్వహించిన మొదటి అంతర్జాతీయ కుంగ్‌ఫూ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 21న నిర్వహించిన ఈ పోటీల్లో అండర్- 12 విభాగంలో విద్యార్థులు ప్రతిభకనబర్చి పతకం, కప్ సాధించినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ నరేష్ అభినందించారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

నెహ్రూసెంటర్, జూలై 27 : మాదిగల ఏబీసీడీ వర్గీకరణనే లక్ష్యంగా మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో జరుపతలపెట్టిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్శనం రామకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం చలోఢిల్లీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ బోడ లక్ష్మణ్‌నాయక్, తప్పెట్ల చాణక్య, దర్శనం నరేంద్రశంకర్, సాయిచందర్, జినక రవీందర్, హెచ్.కృష్ణ, దర్శనం యుగేందర్, టి.చరణ్, పి.చెర్రి, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటిని పరిశీలించిన తహసీల్దార్

కొత్తగూడ, జూలై 27 : మండలంలోని పోలారంలో గౌస్యా ఇంటి గోడ కూలడంతో శనివారం తహసీల్దారు రమాదేవి పరిశీలించారు. జరిగిన నష్టంపై గౌస్యా నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సిబ్బంది సాంబయ్య, పాపరావు పాల్గొన్నారు.